


తారాతీరం

కాటుక చీకటి ఆకాశం..
పాపం..
తారలన్నీ రాలి..
అమాంతం కింద పడ్డాయి..!

నేలకు..
ఎంత సంబరమో..!
ఒక్కొక్కటిగా ఏరుకుని..
అడుగడుగునా అలంకరించుకుంది..!

(దేవరకొండ పైనుంచి.. అనంతపురం నగరం.. రాత్రి)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

అమ్మేదెలా..?

భారీగా పడిపోయిన మిర్చి ధరలు

నిల్వ ఉంచిన రైతుల పరిస్థితి అధ్వానం

పెట్టుబడి కూడా రాదంటున్న అన్నదాతలు





ఏసీ గోడౌన్‌లో నిలువ ఉన్న మిరప బస్తాల స్టాక్, పొలంలో ఆరబెట్టిన మిరపకాయలు

విడపనకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ధరలు పడిపోవడంతో మిరప రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. గత ఏడాది డబ్బి రకం మిరప కాయలను క్వింటా రూ. 40వేల నుంచి రూ. 50 వేలకు వ్యాపారులు అడిగినా రైతులు ఇవ్వలేదు. ఈఏడాది మంచి ధరలు వస్తాయన్న ఆశతో పండిన పంటను గోదాములకు చేర్చారు. రూ.70 వేల నుంచి లక్షపైనే ధరలు వస్తాయని ఆశించారు. అయితే ధర అమాంతం పడిపోవడంతో గత ఏడాది నిల్వ చేసిన మిర్చి ధర క్వింటా రూ. 8 వేల నుంచి 10 వేలలోపే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. (కడ్డీ రకం)సీడ్ కాయల ధర క్వింటా రూ. 5వేల నుంచి ఏడెమిది వేలకు పడిపోయింది. ఈ ఏడాది కొత్తగా కోతలు కోసిన మిరప డబ్బి రకం కాయలు క్వింటా రూ. 20 వేల నుంచి 25వేలు పలుకుతోంది. కడ్డీ రకం కాయలు క్వింటా రూ. 12 వేల నుంచి 14, 15వేలు పలుకుతు న్నట్లు రైతులు చెబుతున్నారు.

భారంగా మిరప సాగు

రైతులు మిరప పంటను బాగా పండించాలనే తపనతో పెట్టుబడులు కూడా భారీగా పెట్టారు. గత ఏడాది నీటి కొరత రావటంతో నీటి కుంటలు తవ్వించుకుని, ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి అందులో నింపి, మిరప పంటకు నీరందించారు. ఎకరాకు అదనంగా దాదాపు రూ. లక్ష వరకూ ఖర్చు చేశారు. సాధారణంగా ఎకరాకు పెట్టుబడి రూ. 1.5 లక్షల నుంచి రూ. రెండు లక్షలు వరకు వచ్చేది. నీటి కష్టాలు రావటంతో అదనంగా ఎకరాకు లక్ష పెరిగిందని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది సాగు నీరు పుష్కలంగా ఉండటంతో మిరప దిగు బడులు అధికంగా రావాలని పంటలకు విపరీతంగా ఎరువులు, మందులు వాడారు. దీంతో డబ్బి రకం పంటకు ఎకరాకు రూ. 2.5లక్షల నుంచి రూ.3లక్షలు, కడ్డీ రకానికి రూ. 2లక్షల నుంచి 2.5లక్షలు పెట్టుబడి వచ్చినట్లు రైతులు తెలిపారు. సొంత పొలం ఉన్న రైతులకు ఎకరాకు రూ. 50వేలు తగ్గుతుందని, అదే కౌలు రైతులకు రూ.50వేలు ఎక్కువ అవుతుంది అని పేర్కొన్నారు.

భయంగా ఉంది



నేను 16 ఎకరాల్లో మిరప సాగు చేశా. ఈ ఏడాది సాగు నీరు పుష్కలంగా అందటంతో దిగుబడి కూడా బాగానే ఉంది కానీ ధరలు తలచుకుంటేనే భయంగా ఉంది. కడ్డీ రకం మిరప క్వింటా రూ. 12 వేల నుంచి రూ.14వేలు ఉంది. ధరలు ఇలా ఉంటే చేసిన అప్పులు ఎలా తీర్చేది? ఏమి చేసి బతికేది? అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే వాటికి మా బతుకులు సరిపోవటం లేదు. ప్రభుత్వాలు ఎగుమతులు ప్రారంభించి, రైతులను ఆదుకోవాలి. ధరలు వచ్చే ఏర్పాట్లు చేయాలి. అప్పుడే రైతులు అప్పుల బారి నుంచి బయట పడతారు. -నరసింహులు, రైతు, ఆర్ కొట్టాల

మామూలుగా ప్రతి ఏడాది డబ్బి రకం మిర్చి ధర క్వింటా రూ.40 వేల నుంచి రూ.50వేలకు తగ్గదు. కడ్డీ రకం అయితే రూ.25 వేల నుంచి 30వేలు దాకా విక్రయించే వారు. అయితే మిరప ధరలు ఒక్కసారిగా పడిపోవటంతో రైతులుకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. కొంత మంది డబ్బి రకం మిరప కాయలు రంగు మారాయని కేవలం రూ. 5వేలకే క్వింటా విక్రయించేశారు.

50 శాతం తగ్గిన సాగు

ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో జీబీసీ కింద, హంద్రీనీవా కాలువ కింద వివిధ బోరుబావుల కింద గత ఏడాది 45వేల ఎకరాల్లో మిరప పంటలను సాగు చేశారు. డబ్బి రకాన్ని క్వింటా రూ.40 వేల నుంచి రూ.50వేలకు విక్రయించుకున్నారు. కడ్డీ రకాన్ని క్వింటా రూ.18 వేల నుంచి రూ.25వేల వరకూ విక్రయించుకున్నారు. కానీ మరి కొంత మంది రైతులు ఇంకా ధరలు పెరుగుతాయనే ఆశతో కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, చెలికేర, బ్యాడిగి, హుబ్లీ, వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడి గోదాముల్లో వేల బస్తాల మిరపను నిల్వ ఉంచారు. అక్కడ ఒక బస్తాకు సంవత్సరానికి బాడుగ రూ.300 నుంచి 350 వసూళ్లు చేస్తారు. అదే మన రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వ ఉంచితే రూ. 200 నుంచి 250 లు వసూళ్లు చేస్తారు. గత ఏడాది నుంచి ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ ఏడాది మిరప సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది కేవలం 21వేల ఎకరాల్లోనే మిరప పంటను సాగు చేశారు. పంటకు సాగు నీరు పుష్కలంగా అందటంతో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. అయితే కోతల సమయంలో ధరలు అమాంతం పడి పోవటంతో చేసిన అప్పులు ఎలా తీర్చుకోవాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎగుమతి లేకేనా ?

ఆసియాలోని ఇతర దేశాలకు మిరప ఎగుమతులు ఆగిపోవటంతోనే మిరప ధరలు పతనమయ్యాయని పలువురు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లలోకి లక్షల టన్నుల మిరప నిల్వలు వస్తుండటంతో ధరలు అమాంతంగా తగ్గించారని మరి కొంత మంది రైతులు పేర్కొంటున్నారు. కొత్త కాయలను కూడా గత ఏడాది కంటే 50శాతం తక్కువ ధరలకు అడుగుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. మిరప పంట ఎగుమతులు జరిగితే తప్పకుండా మంచి ధరలు వస్తాయని మిరప రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కోతకు సిద్ధంగా ఉన్న డబ్బి రకం కాయలు



నిల్వ చేశా



నేను గత ఏడాది ఏడు ఎకరాల్లో మిరప సాగు చేశా. నాలుగు ఎకరాల్లో డబ్బిరకం, మూడు ఎకరాల్లో కడ్డీ రకం సాగు చేశా. సరైన ధరలు లేక పోవటంతో 27 క్వింటాళ్ల డబ్బి కాయలు, 11 క్వింటాళ్ల కడ్డీ కాయలను బ్యాడిగకు తీసుకెళ్లి ఏసీ గోదాములో నిల్వ ఉంచా. గత ఏడాది క్వింటా రూ. 35వేలకు అడిగినా ఇవ్వలేదు. మంచి ధర వస్తే ఇద్దామనుకుంటే ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. డబ్బి కాయను క్వింటా రూ. 9వేల నుంచి రూ.10వేలకు అడుగుతున్నారు. కడ్డీ కాయలను ఆరువేలకు అడుగుతున్నారు ఇంత దారుణమైన ధరలను నేను ఎప్పుడు చూడలేదు. కనీసం పెట్టుబడులు కూడా రావు.

టి. రాజన్న, రైతు, డోనేకల్లు

గొర్రెల పెంపకమే బాగుండేది



నేను ఐదెకరాల్లో మిరప సాగు చేశా. ఏదో గొర్రెలను పెంచుకుని జీవనం చేసే నేను మిరప పంటను పండించి బాగు పడదామని మిరప పంటవైపు వచ్చా. ఎకరాకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టా. మిరప పంటను సాగు చేసిన ఏడాదే నాకు రూ.10లక్షలు నష్టం వచ్చింది. క్వింటా డబ్బి కొత్త కాయలే రూ.20వేల నుంచి రూ.25వేలు పలుకుతున్నాయి. ఇలా అయితే అప్పులు ఎలా తీర్చుకునేది? కూలీలకు ఏమి ఇచ్చేది, కౌలు ఏమి ఇచ్చేది, మందుల షాపులకు ఏమి ఇవ్వాలి. నాకు గొర్రెల పెంపకమే బాగుండేది. మిరప సాగుకు వచ్చి అప్పుల పాలు అయ్యాను.

-ఎం కదిరప్ప, రైతు, ఆర్ కొట్టాల

క్వింటా రూ.5 వేలకు ఇచ్చా..



నేను దాదాపుగా 12 ఎకరాల్లో మిరప సాగు చేశా. గత ఏడాది కొంత విక్రయించి, 20 క్వింటాళ్లు ఏసీ గోదాములో స్టాక్ ఉంచా. మంచి ధరలు వస్తే విక్రయించాలని అనుకున్న సమయంలో ధరలు పడిపోయాయి. వ్యాపారులు రూ. 40వేలుతో అడిగినా ఇవ్వలేదు. ఇప్పుడు రూ. 5వేలతో 20 క్వింటాళ్లు విక్రయించా. దాదాపుగా నాకు రూ.6లక్షలు నష్టం వచ్చింది. కనీసం పెట్టిన పెట్టుబడులు రాలేదు. కూలీలకు ఇచ్చిన డబ్బులు కూడా వెనక్కిరాలేదు. ఇంకా 500 బ్యాగుల స్టాక్ ఏసీలోనే ఉంచా.

-ఎన్.రామకృష్ణ, రైతు, జనార్ధనపల్లి

నేడు గార్లదిన్నెలో కంటి అద్దాల పంపిణీ

హాజరుకానున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణలో భాగంగా, దృష్టి లోపం ఉన్న చిన్నారులకు ప్రభుత్వం శుక్రవారం కంటి అద్దాలను పంపిణీ చేయనుంది. గార్లదిన్నె మోడల్ స్కూల్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ పద్మావతి, జాయింట్ డైరెక్టర్ సునీల్ కుమార్ నాయక్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పర్యవేక్షణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. మోడల్ స్కూల్, కేజీబీవీలలోని 98మంది విద్యార్థులకు కంటి అద్దాలను అతిథులు అందజేస్తారు. కూడేరు పీహెచ్‌సీని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేశారు. స్వస్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ పీహెచ్‌సీని మోడల్‌గా తీర్చిదిద్ది, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటుంది. ఈ పీహెచ్‌సీని వైద్య ఆరోగ్య శాఖ కమిషనరు వీరపాండియన్ శుక్రవారం పరిశీలించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

హాస్టల్‌లో దుస్తుల దిబ్బ

మూడేళ్లుగా పంపిణీ చేయని వైనం

రాకెట్ల ఎస్సీ హాస్టల్ వార్డెన్ నిర్వాకం



రాకెట్ల ఎస్సీ హాస్టల్‌లో పాడైపోయిన కొత్త దుస్తులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు అందాల్సిన దుస్తులు మూడేళ్లుగా మూలనపడ్డాయి. వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా దుమ్ముపట్టిపోయాయి. ఉరవకొండ మండలం రాకెట్ల ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహంలో గుట్టలుగా పేరుకుపోయిన దుస్తులను తనిఖీకి వెళ్లిన అధికారులు గుర్తించారు. వైసీపీ హయాంలో, మూడేళ్ల క్రితం వీటిని హాస్టల్‌కు పంపినట్లు సమాచారం. దాదాపు 500 జతల యూనిఫాంను విద్యార్థులకు ఇవ్వకుండా, వార్డెన్ ఓ గదిలో పడేశారు. దీంతో విస్తుపోయిన తనిఖీ అధికారులు, వీటి రికార్డులు అడిగినా లేవని వార్డెన్ చెప్పినట్లు సమాచారం. తమకు ఒక జత దుస్తులు కూడా ఇవ్వలేదని హాస్టల్ విద్యార్థులు చెప్పినట్లు సమాచారం. వార్డెన్ తీరు గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. వృథా అయిన యూనిఫాం విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని సమాచారం.

ఆక్రమించు.. విక్రయించు..!



98-3లోని వంక పోరంబోకు భూమి

వంక పోరంబోకుతో వైసీపీ నాయకుడి వ్యాపారం

ఒకటిన్నర సెంటు రూ.40వేల ప్రకారం బేరం

బెడిసి కొడుతున్న వ్యవహారం



వంక పోరంబోకు భూమిలో పారుతున్న వంక

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆక్రమించు.. విక్రయించు అన్న రీతిలో వైసీపీ నేతలు సాగిపోతున్నారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను ఆక్రమించేశారు. వంకలు, చెరువులను సైతం కబ్జా చేసి, అమ్మేసుకున్నారు. ఇలాంటిదే అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీలోని ఓ ప్రభుత్వ స్థలం. పక్క మండలానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చదును చేసి తన ఆధీనం ఉంచుకున్నాడు. ప్లాట్లుగా విభజించి, విక్రయించేం దుకు ప్రయత్నించాడు. అయితే అనుకున్న రీతిలో పనులు సవ్యం గా సాగకపోవడంతో అలానే ఉండిపోయాడు. మళ్లీ ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమిత భూమిని విక్రయించే పనులు మొదలు పెట్టాడు. ఈక్రమంలోనే ఒకటిన్నర సెంటు రూ.40వేల ప్రకారం విక్రయించేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ప్లాట్లుగా విభజించి...

చిన్నంపల్లి పంచాయతీ కురుగుంట గ్రామ సర్వే నెంబరు 98-3లో వంక పోరం బోకు భూమి ఉంది. దీనికి ఆనుకుని ఉన్న మరో సర్వే నెంబరులో ఎకరాకుపైగా ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన వైసీపీ నాయకుడికి కొంత భూమి ఉంది. ఆయన భూమికి ఆనుకునే 98-3లో మూడు ఎకరాల వరకు వంక పోరం బోకు భూమి కూడా ఉంది. దాన్ని వైసీపీ పాలనలో ఆక్రమించుకుని, చదును కూడా చేయించాడు. అప్పట్లోనే ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో రూ.10లక్షల వరకు వసూలు చేసి సొమ్ము చేసుకున్నాడన్న ఆరోపణలు సంబంధిత వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే అనుకున్న పనులు సక్రమంగా జరగకపోవడంతో అలానే ఉండిపోయారన్న వాదనలున్నాయి. నాలుగైదు నెలల కిందట గతంలో మాదిరిగా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అయితే వ్యవహారం టీడీపీ నాయకుల దృష్టికి వెళ్లడంతో వ్యవహారం బెడిసి కొట్టిందన్న వాదనలు గ్రామంలో వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమిత భూమిని తన బావమరిదితో కలిసి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఆక్రమిత భూమిలో ఒకటిన్నర సెంటు ప్రకారం వందకు పైగా ప్లాట్లు వేయనున్నారు. ఈలెక్క ఒక్కొక్క ప్లాట్ రూ.40వేలతో బేరం పెట్టినట్లు తెలుస్తోంది.

బావమరిది ద్వారా..

వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్న భూమిని విక్రయించేందుకు ప్రస్తుతం తన బావమరిదిని రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి ఆత్మకూరు మండలంలో టీడీపీ నాయకుడిగా ముద్ర వేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉండటంతో ఆ వ్యక్తి రంగంలోకి దిగి ఈ వ్యవహారాన్ని ముందుకు నడపడానికి ప్రయత్నిస్తున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. వ్యవహారం మండల టీడీపీ సీనియర్ నాయకుడి వద్దకు వెళ్లడంతో ఆయన మందలించినట్లు ఆయా వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారితో రూ.లక్షలు దండుకున్న వైనం


ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన ఆ వైసీపీ నాయకుడు గతంలోనే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారితో రూ.15లక్షలపైగానే దండుకుంటున్నట్లు ఆయా వర్గాల్లో చర్చజరుగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థానికంగా వెంచర్ వేసేందుకు కొంత భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిలోకి రోడ్డు వేసుకునేందుకు ఆ వైసీపీ నాయకుడు ఆక్రమించిన భూమి అనువుగా ఉంది. ఈక్రమంలోనే ఆక్రమిత భూమిలో దారి వదిలేందుకు ఏకంగా రూ.15లక్షలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. ఇలా ఆ నాయకుడు అందినకాడికి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది.

మా దృష్టికి వచ్చింది



కురుగుంట గ్రామ సర్వే నెంబరు 98-3లోని వంక భూమిని ఆక్రమించి అమ్మకాలు చేస్తున్నారన్న విషయం మాదృష్టికి వచ్చింది. దానిపైన విచారణ చేయిస్తున్నాం. ఇదే క్రమంలో వంక పోరం బోకు భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్ మండలం



ప్రేమికుల లోకమంతా సంబరాలకు సిద్ధమౌతున్న సమయంలో అతను ఆమె నంబర్ బ్లాక్ చేశాడు. విరహ వేదన భరించలేక.. ఆమె పోలీసుల సాయం కోరింది. ఏకంగా డయల్ 100కు ఫోన్ చేసింది. 'సార్.. నా బాయ్‌ఫ్రెండ్ నా నంబర్‌ను బ్లాక్ చేశాడు. నాతో మాట్లాడటం లేదు. మీరు ఫోన్ చేసి వాడితో మాట్లాడండి. నా నంబర్‌ను అన్ బ్లాక్ చేయించండి..' అని కోరింది. దీంతో పోలీస్ కంట్రోల్ రూం నుంచి గుత్తి స్టేషన్‌కు వెంటనే సందేశం వచ్చింది. ఆమె ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓకు ఆదేశం వచ్చింది. గుత్తి ఆర్‌ఎస్‌లోని ఓ కాలనీ నుంచి గురువారం సాయంత్రం 5.46 గంటలకు ఆ ఫోన్ కాల్ వచ్చింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లారు. బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ సుధాకర్ ఆ యువతికి ఫోన్ చేశారు. ఎక్కడున్నారో చెబితే వచ్చి కలుస్తామని అన్నారు. దీనికి ఆ యువతి నిరాకరించింది. 'ఇంటి వద్దకు రావద్దు. నా బాయ్‌ఫ్రెండ్ నంబర్ ఇస్తాను. అతనితో మాట్లాడండి. నా నంబర్‌ను అన్‌బ్లాక్ చేయిస్తే చాలు' అని విన్నవించింది. దీంతో ఆమె బాయ్‌ఫ్రెండ్ నంబర్ సేకరించి, ఫోన్ చేశారు. అతను స్పందించలేదు. అదే విషయాన్ని ఆ యువతికి చెప్పి, స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

వైసీపీ పాపం..!

• పాల సేకరణ కేంద్రం మూత • పాడి రైతులకు అందని బకాయిలు



మూతపడిన పాల సేకరణ కేంద్రం

గత వైసీపీ పాలకుల పాపం.. పాడి రైతులకు శాపంగా మారింది. పట్టణ పరిధిలోని పాల సేకరణ కేంద్రాన్ని ఉన్నఫలంగా మూత వేయడంతో పాడి రైతులకు బకాయిలు అందకుండా పోయాయి. ఏకంగా రూ.17 లక్షలు చెల్లించాల్సి ఉందని పాడి రైతులు వాపోతున్నారు. ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామంటూ వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చెల్లించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాయదుర్గం రూరల్

టీడీపీ హయాంలో ఏర్పాటు

వ్యవసాయంలో నష్టాలు రావడంతో చాలా మంది రైతులు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ వైపు మొగ్గారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాడి రైతులకు బాసటగా నిలవాలని రాయదుర్గంలో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించింది. రాయదుర్గం మండలంలోని డీ కొండాపురం, బీఎన్‌హళ్లి, బొమ్మక్కపల్లి, వజ్రవన్నూరు, రేకులకుంట, రాయంపల్లి, గుమ్మఘట్ట మండలంలోని గలగల, గొల్లపల్లి, కలుగోడు, బేలోడు, నేత్రపల్లి, డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి, హనుమాపురం, ఎస్‌ఆర్ కోట గ్రామాల నుంచి పాలను సేకరిస్తుండేవారు. 100 లీటర్లతో ప్రారంభమైన పాల సేకరణ కేంద్రం.. మూడు వేల లీటర్ల స్థాయికి చేరింది. రైతుల నుంచి పాలను సేకరిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు కూడా చెల్లిస్తూ ఉండేది. తద్వారా రైతులు లాభాలు గడిస్తుండేవారు.

వైసీపీ రాకతో మూత

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పాల సేకరణ కేంద్రానికి గడ్డుకాలం మొదలైంది. డెయిరీని ప్రైవేటు పరం చేయడంతో 2020లో ఏకంగా మూత వేశారు. దీంతో పాడి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రైవేటు డెయిరీలకు పాలను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాల సేకరణ కేంద్రం మూత వేసేనాటికి నియోజకవర్గంలో 210 మంది రైతులకు రూ.17 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బిల్లుల కోసం పాడి రైతులు.. వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. బకాయి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన గత వైసీపీ పాలకులు.. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

తుప్పుపట్టిన పరికరాలు

పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో అందులోని పరికరాలు తుప్పు పడుతున్నాయి. కాలర్ క్రైజర్ యంత్రాలు, ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. సామగ్రి తుప్పు పట్టింది. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

రూ.లక్ష బకాయిలు రావాలి



గతంలో డెయిరీకి పాలను విక్రయించేవాడిని. బిల్లు రూ.లక్షదాకా రావాల్సి ఉంది. డెయిరీ మూతతో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ధరలు, డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. విధి లేని పరిస్థితిల్లో వారు చెల్లించిన బిల్లులను తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వ పాలకేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

-తిమ్మరాజు, పాడి రైతు, బీఎన్ హళ్లి

పాల కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి



టీడీపీ పాలనలో ప్రభుత్వమే డెయిరీలను ప్రారంభించి, రైతుల నుంచి పాలను సేకరించేది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాల సేకరణ కేంద్రాన్ని మూత వేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల బిల్లుల కోసం రైతులు.. కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయారు. కూటమి ప్రభుత్వమైనా పాడి రైతుల కష్టాలను గమనించి, పాల కేంద్రాలను ప్రారంభించాలి.

-తిప్పేస్వామి, రైతు కూలీ సంఘం నియోజకవర్గ కార్యదర్శి

అరణ్యం.. కాపాడుకోవడమే శరణ్యం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముందుగానే కరువు జిల్లా. వర్షపాతం తక్కువ. పచ్చని పైర్లు కనిపించేదీ అరుదు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ఉన్న మార్గం అడవులు. అటవీ ప్రాంతాన్ని కాపాడుకుంటేనే మనుగడ సాధ్యమన్నది నిర్వివాదాంశం. వేసవి ప్రారంభమవడంతో అడవులకు అగ్ని ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. మండే ఎండలకు మంటలు చెలరేగే అవకాశం ఉంది. అదే జరిగితే పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవడంతో వన్యప్రాణాలు మాడి మసైపోతాయి. ఈ నేపథ్యంలో అగ్ని నుంచి అడవిని కాపాడటం అటవీశాఖ సిబ్బందికి సవాల్‌గా మారింది. ఏడాదిపాటు కాపాడిన అడవి వేసవిలో రాత్రికి రాత్రే మాడి మసైపోతుంది. అగ్గి నుంచి అడవుల పరిరక్షణకు

ప్రత్యేక కార్యాచరణ
- తరచూ అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారి వివరాల నమోదు
- ఏటా మంటలు చెలరేగే ప్రాంతాల గుర్తింపు
- నివారణ చర్యలపై స్థానికులకు అవగాహన
- కంట్రోల్ బర్నింగ్ ద్వారా నష్ట నివారణ



మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఫైల్)

జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌ఓ) విఘ్నేష్ నూతన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆ దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. జిల్లాలో ఏటా అగ్ని ఎక్కడెక్కడ పడుతుంది, ఫైర్ వాల్స్ ఎక్కడన్నది సిబ్బంది ద్వారా గుర్తించి, రికార్డులు తయారు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టి మంటలను అదుపు చేయాలని భావిస్తునానరు. మంటలు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

నూతన చర్యలు

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి, ఏ సమయంలో అడవిలో అగ్గిపడినా సహకారం అందించేలా వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. గ్రామాల నుంచి ఏ దారి వెంబడి స్థానికులు అడవిలోకి వెళ్తున్నారు, తిరిగి ఎలా వస్తున్నారన్న వివరాలను అటవీశాఖ సిబ్బంది ద్వారా నమోదు చేయిస్తున్నారు. సమీప ప్రదేశాల్లో మంటలు చెలరేగితే అడవిలోకి వెళ్లే స్థానికులను కూడా బాధ్యులను చేస్తూ అదుపు చేసేలా తగిన చర్యలు చేపడుతున్నారు. మంటలు ఎలా పడ్డాయన్న దానిపై రిజిస్టర్‌లో నమోదు చేసిన వారిని పిలిపించి, విచారణ చేయనున్నారు. ఇందులో వారి తప్పు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు చేపట్టి, కటకటాల పాలు చేయనున్నారు. ఈ చర్యల ద్వారా అగ్గి నుంచి అడవిని కొంతవరకైనా కాపాడుకునే వెసులుబాటు ఉంటుందని డీఎఫ్‌ఓ చెప్పుకొస్తున్నారు.

మంటల అదుపునకు..

అడవిలో మంటలు ఏర్పడితే వాటిని అదుపు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏటా మంటలు చెలరేగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఆ ప్రదేశంలో మళ్లీ అగ్గి పడినా పక్క ప్రాంతాలకు పాకకుండా కంట్రోల్ చేసేలా శుభ్రం చేయిస్తునానరు. మరి ఎంతవరకు ఫలితాలు సాధిస్తారన్నది తెలియాలంటే వేచిచూడాల్సిందే..

ప్రత్యేక చర్యలతో అడవిని కాపాడుతాం



కంట్రోల్ బర్నింగ్ విధానం ద్వారా అగ్గి నుంచి అడవిని కాపాడవచ్చు. అందుకు అనుగుణంగా జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫైర్ వాల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తున్నాం. అక్కడ కంట్రోల్ బర్నింగ్‌కు తగిన చర్యలు చేపట్టి, పక్క ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటాం.

- విఘ్నేశ్, జిల్లా అటవీ శాఖాధికారి

పాత సరుకు.. కొత్త ధరకు..

మద్యం షాపుల్లో అదనపు వసూళ్లు
- పాత స్టాక్ పెంచిన రేట్లతో విక్రయాలు
- మందుబాబుల జేబులకు చిల్లు
- కనిపించని ధరల పట్టిక
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం ధరల పెంపును పలు షాపుల నిర్వాహకులు అడ్డాదిడ్డంగా సొమ్ము చేసుకుంటున్నారు. అదనపు వసూళ్లకు దిగుతున్నారు. క్వార్టర్‌తోపాటు హాఫ్, ఫుల్ బాటిళ్ల ధరలను రూ.10 చొప్పున ప్రభుత్వం పెంచింది. రూ.99 రకం మద్యం బాటిల్, బీర్ల ధరలను యథాతథంగా ఉంచింది. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన మద్యాన్ని పాత ధరకే విక్రయించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా జిల్లాలోని కొన్ని మద్యం దుకాణాల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు మద్యం ధర పెరిగినరోజే కొత్త మద్యం ధరల పట్టికను మద్యం షాపుల వద్ద ప్రదర్శించాలి. ఎక్కడా అవి కనిపించకపోవడం గమనార్హం.

పెంచిన ధరలతో విక్రయాలు

జిల్లాలో 136 ప్రైవేటు మద్యం దుకాణాలున్నాయి. 19 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. మూడు రోజులుగా జిల్లాలోని అన్ని మద్యం దుకాణాల్లో పాత స్టాక్‌ను కొత్త ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల మేరకు ఐఎంఎల్ డిపో నుంచి ఇదివరకు పాత ధరలకు కొనుగోలు చేసిన మద్యాన్ని అవే రేట్లతో విక్రయించాల్సి ఉంది. మద్యం దుకాణాల్లో పాత సరుకునే పెంచిన ధరతోనే విక్రయిస్తుండటం గమనార్హం. క్వార్టర్‌తోపాటు హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచారు. అనంతపురం నగరంతోపాటు జిల్లాలోని ఇతర మండలాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 లెక్కను చూపుతూ హాఫ్ బాటిల్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.30 అదనంగా వసూలు చేస్తుండడం గమనార్హం. అనంతపురం నగర శివారులోని దుకాణాలు, పలు సర్కిళ్లలో రూ.99 మద్యం బాటిల్‌ను రూ.110కి విక్రయించడం విశేషం. వాస్తవానికి రూ.99 మద్యం బాటిల్ ధరను ప్రభుత్వం పెంచలేదు. అయినా అన్ని రకాల బ్రాండ్ల మద్యం ధరలు పెంచారం టూ ఆ రకంపైనా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు మండల కేంద్రాల్లో బీర్లపైనా అదనంగా రూ.20 వసూలు చేస్తున్నట్లు సమాచారం.



మద్యం షాపు వద్ద కనిపించని కొత్త ధరల పట్టిక

అదనంగా వసూలు చేస్తే చర్యలు

ప్రభుత్వం క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున పెంచింది. బీర్లు, రూ.99 రకం మద్యం బాటిల్ ధరలు పెంచలేదు. ఇదివరకే మద్యం దుకాణదారులు కొనుగోలు చేసిన పాత సరుకును అదే ధరకే విక్రయించాలి. ధరలు పెంచిన తర్వాత ఐఎంఎల్ డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లను మాత్రమే పెంచిన ధరకు విక్రయించాలి. అన్ని షాపుల వద్ద బ్రాండ్ల వారీగా పెంచిన ధరలు ప్రదర్శించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఎమ్మార్పీపై అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

-రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కన్నెత్తి చూడని ఎక్సైజ్ యంత్రాంగం

మద్యం షాపుల్లో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం తప్ప.. క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. మద్యం ధరలు పెరిగిన నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాత సరుకును కొత్త ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లపై రూ.10 చొప్పున మాత్రమే ప్రభుత్వం పెంచిందనీ, ఆ మేరకు కొత్త ధరలు అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని మద్యం దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు రోజులుగా నిబంధనలు అతిక్రమించి అదనపు ధరలకు మద్యం విక్రయిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసిన పాపాన పోలేదు.

జిల్లాకు పతకాల పంట

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ అనంత జట్టుకు ఘన సత్కారం



రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట పండింది. రాజధాని అమరావతి సమీపంలోని మంగళగిరి స్టేడియంలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025కు 13 ఉమ్మడి జిల్లాల పారా అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించారు. ఇందులో జిల్లా అథ్లెట్లు అత్యధికంగా 43 పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. వాటిలో 20 బంగారు, 19 రజత, 11 కాంస్య పతకాలున్నాయి. విజేతలను గురువారం స్థానిక అశోక్ నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌కుమార్, మీనాక్షమ్మ ఫౌండేషన్ రవికాంత్ రమణ పతకాలు, సర్టిఫికెట్లు, టీ షర్టులు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయిసంస్థ విజయసాయి కుమార్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆరుగురి ఎంపిక



సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి

చెన్నైలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీలకు జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో సాకే బాబు, సహన, అల్లావలి, వెంకటేష్, పల్లవి, సంజయ్‌రెడ్డి ఉన్నారు. వారిని పలువురు అభినందించారు.

జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యకవర్గం ఎన్నిక

అనంతపురంరూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండలంలోని రాచానపల్లిలోని యేసుకృపా మందిరంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పాస్టర్ నెహెమ్యా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ మార్కు, కార్యదర్శిగా ఆనంద్, సహాయ కార్యదర్శిగా మనషే, కోశాధికారిగా జీవన్‌బాబు, ఈసీ మెంబర్లుగా జహంగీర్ జాషువా, లాబాన్ సుధాకర్, విజయ్‌సింహ, చార్లెస్ నాయక్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో షాలేమ్ రాజు, బందెల రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నూతన జిల్లా కమిటీ సభ్యులు

ప్రతి హామీ నెరవేరుస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడిమర్రి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండంలోని మరువపల్లిలో గురువారం 87 మంది రైతులకు మంతిర ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీకి సంబంధించి ఉత్తర్వులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని, గృహ అవసరాలను విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రైతులు పొలాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని వ్యవసాయ మోటార్లకు కూడా విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. ఆ తరువాత శివంపల్లిలో కోకో కోలా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటు, ఆర్వో ఏటీఎంను మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో జల్‌జీవన్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు అలాగే ఉండిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజురు చేసి పని ప్రారంభించిందన్నారు. ప్రతిఇంటికి కొళాయి ఏర్పాటుచేసి, తాగునీరు అందిస్తామన్నారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ కూచి రాము, నాయకులు పాల్గొన్నారు



దివ్యాంగుడి సమస్యను వింటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

అధికారులకు మంత్రి సవిత ఆదేశం

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం నియోజకవర్గస్థాయి అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి పాలనలో ఇచ్చిన వాటితోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్నామన్నారు. వాటిని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మంత్రి

రాయల జయంతికి ఆహ్వానం

ఈనెల 16న పెనుకొండలో నిర్వహించే శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవానికి రావాలని మంత్రి సవితకు బలిజ సంఘం ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం ఆగస్టులో ప్రభుత్వం తరఫున కృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గుట్టూరు సూరి, పూల శీనా, కల్యాణ్ పాల్గొన్నారు.

మత్స్యకార లైసెన్స్ ఇవ్వాలి

గొల్లపల్లి రిజర్వాయర్‌పై లైసెన్స్ సిస్టం ఏర్పాటుచేసి, తమకు లైసెన్స్ మంజూరు చేయాలని మంత్రి సవితను గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మత్స్యకారులు కోరారు. వారు మాట్లాడుతూ.. గొల్లపల్లి రిజర్వాయర్‌కు తమ పొలాలు తీసుకున్నారన్నారు. అప్పట్లో పరిహారం తక్కువగా ఇచ్చారన్నారు. చేపలవేటే తమకు జీవనాధారమనీ, లైసెన్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సేవాఘడ్‌లో ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు



అలంకరణలో సేవాలాల్ మహారాజ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేర్లోపల్లిలోని బంజారాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో గురువారం 286 జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతాజగదాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేశారు. ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. స్వామివారికి శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రికి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దఎత్తున తరలివస్తారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి గుర్రంపై ఊరేగిస్తారు. మాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారు. శనివారం మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తారు. దీంతో జయంత్యుత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు జగన్నాథరావు, అశ్వత్థనాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి అతిరుద్ర మహాయజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలో శుక్రవారం నుంచి విశ్వశాంతి కోరుతూ అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం సాయి కుల్వంత్ సభామండపంలో ఏర్పాట్లు చేపట్టారు. 11 హోమ గుండాలను సిద్ధం చేశారు. సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలు ఈ ఏడాది నవంబరులో జరగనున్నాయి. అందులో భాగంగానే అతిరుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. యజ్ఞంలో వంద మందికిపైగా పండితులు పాల్గొననున్నారు. భక్తుల కోసం ప్రశాంతి నిలయంలో ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలువురు యజ్ఞంలో పాల్గొనడానికి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. 12 రోజులపాటు యజ్ఞం కొనసాగనుంది.

పిల్లల్లారా.. పిడుగుల్లారా.. రారండోయ్..

నేటి నుంచి పిల్లల పండుగ.. అనంత బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పిల్లలు చేసే అల్లరి, డ్యాన్సులు, కళా ప్రదర్శనలు.. అవన్నీ కళ్లారా చూస్తేనే.. తనివీతారా ఆస్వాదిస్తేనే తప్ప.. మాటల్లో వర్ణించలేం. అలాంటి ఆనందాల పండుగకు వేళయింది. పిల్లల పండుగ (అనంత బాలోత్సవం-2025) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్‌లో అనంత బాలోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, సహాయ కార్యదర్శి సావిత్రి పరిశీలించారు. షమీమ్ షఫివుల్లా మాట్లాడుతూ.. 14, 15, 16 తేదీల్లో నిర్వహించే బాలోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పిల్లల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో మానసికోల్లాసం పెంపొందించేందుకు ఈ ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాలోత్సవాల్లో పాల్గొనేందుకు పాఠశాలలవారీగా ఈ సారి పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరచిని వారికి బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సహాయ కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ... విద్యార్థులు ఆటపాటలు, కళాసాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంవల్ల వారిలో ఉత్తేజం పెరుగుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 10వేల మంది విద్యార్థులు బాలోత్సవాల్లో పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు శ్యామలమ్మ, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని పాల్గొన్నారు.

పది ప్రీ ఫైనల్ గణిత పరీక్ష సమయం మార్పు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ నేపథ్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే పదో తరగతి గణితం ప్రీ ఫైనల్ పరీక్షల సమయాన్ని మార్పు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 11.45 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రశ్నపత్రాలను మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరీక్ష సమయానికి గంట ముందు 7.30 గంటలకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

త్వరలో కుడి కాలువకు నీరు బంద్..?

పీఏబీఆర్‌లో తగ్గిన నీటి మట్టం

తాగునీటి అవసరాలకు నిల్వ


పీఏబీఆర్‌లో తగ్గిపోయిన నీటిమట్టం

కూడేరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం రోజురోజుకీ తగ్గిపోతోంది. దీంతో కుడికాలువకు నీరు త్వరలోనే బంద్ చేసే అవకాశం కనిపిస్తోంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటి రాక కూడా తగ్గిపోయింది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో నీటి మట్టం 432.200 మీటర్ల వద్ద, 3.595 టీఎంసీల నిల్వ ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 3.650 టీఎంసీలు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి దాదాపు 1.800 టీఎంసీల నీరు పీఏబీఆర్‌లోకి వచ్చినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. కుడికాలువ కింద 37 చెరువులకు 4.157 టీఎంసీల నీటిని రెండున్నర నెలలపాటు అందించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన చెరువుల్లో నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. పాత నీటి నిల్వతో కలిపి ప్రస్తుతం 3.595 టీఎంసీల నిల్వ ఉంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లోకి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు తగ్గిపోవడంతో ఇన్‌ఫ్లో దాదాపు పడిపోయింది. కుడి కాలువకు 700 క్యూసెక్కులు వదులుతుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గిపోతోంది. కాలువకు నీటి విడుదలను నిలిపివేసే అవకాశం కనిపిస్తోంది. వేసవి మొదలు కావడంతో పీఏబీఆర్‌లో ఏర్పాటు చేసిన నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి, సత్యసాయి, ఉరవకొండ నియోజకవర్గ తాగునీటి పథకాలతోపాటు అనంతపురం నగరానికి తాగునీటిని అందించేందుకు 3.500 టీఎంసీల నీరు నిల్వ చేయనున్నారు. దీంతో కుడి కాలువకు త్వరలోనే నీరు నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఫోన్ ఇన్ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక రేడియో స్టేషన్‌లో గురువారం ఉదయం వైద్య, ఆరోగ్య సమస్యలపై ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలు, మెడికల్ సర్టిఫికెట్ల జారీలో తలెత్తుతున్న సమస్యలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు ఇలా దాదాపు 15 మంది వరకు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి కలెక్టర్ పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలు తెలుసుకోవడానికే శాఖలవారీగా ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, పథకాలు, చట్టాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

తిమ్మమ్మ మర్రిమాను వద్ద అభివృద్ధికి అడుగులు

పర్యాటక శాఖాధికారుల పరిశీలన

నంబులపూలకుంట, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను, పరిసర ప్రాంతాలను పర్యాటక శాఖాధికారులు గురువారం పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్ బాబు మాట్లాడుతూ.. తిమ్మమ్మ మర్రిమాను వద్ద సమస్యలను గుర్తించి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించేందుకు వచ్చామన్నారు. నివేదికలు తయారు చేసి, పంపనున్నట్లు చెప్పారు. మర్రిమాను చుట్టూ చేపడుతున్న రింగ్‌రోడ్డు పనులు అటవీ భూముల పరిధిలో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టారన్నారు. అటవీ భూముల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం తిమ్మమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం సంచాలకుడు ప్రతాప్‌రెడ్డి, ఏపీటీడీసీ డీఈ కుమార్, ఏఈ నారాయణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు తెలి పారు. మార్కెట్‌కు మొత్తం 67 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

15 మంది బిల్డర్లపై చార్జిషీట్

పుట్టపర్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించిన బిల్డర్లు నోటీసులకు స్పందించకపోవడంతో 15 మందిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద గురువారం తెలిపారు. అక్రమ నిర్మాణాలపై 50మందికి గతంలో నోటీసులు ఇచ్చామన్నారు. కొంతమంది స్పందించారన్నారు. నోటీసుకు స్పందించని 15 మందిపై చార్జిషీట్ ఫైల్ చేశామన్నారు. మరికొంతమందికి నోటీసులు జారీ చేసి, గడువు ఇచ్చామన్నారు. వారు స్పందించకపోతే చార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

పోర్టుఫోలియో జడ్జిగా జస్టిస్ రామక్రిష్ణ ప్రసాద్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా జస్టిస్ గన్నమనేని రామక్రిష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలలకు గురువారం పోర్టుఫోలియో జడ్జిలను నియమించారు. అందులో భాగంగా జిల్లాకు జస్టిస్ రామక్రిష్ణ ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతి నిజమేనా..?

బీసీ సంక్షేమశాఖ అధికారి తీరుపై విచారణ

పుట్టపర్తిలో పర్యటించిన విచారణాధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి గురించి శుక్రవారం శాఖాపరమైన విచారణ జరిగింది. 'అ'ధన'పు బాధ్యతలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని మంత్రి సవిత, ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ తీవ్రంగా పరిగణించారు. జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన గురువారం పుట్టపర్తిలో పర్యటించి, విచారించారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్నం విచారణ ప్రారంభించారు. ముందుగా ఆ జిల్లాలోని 28 మంది వార్డెన్లను పిలిపించారు. ఒక్కొక్క వార్డెన్‌తో విడివిడిగా మాట్లాడారు. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ముడుపులను నగదు ఇచ్చారా..? ఆన్‌లైన్ లావాదేవీలు నడిపారా..? మధ్యవర్తి ద్వారా నడిపారా..? అని ప్రశ్నించినట్లు తెలిసింది. వార్డెన్లతో ఆ అధికారి వ్యవహరిస్తున్న తీరుపైనా ఆరా తీసినట్లు సమాచారం. అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ప్రశ్నించినట్లు తెలిసింది. మెజార్టీ వార్డెన్లు ఆ అధికారి తీరు గురించి కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. కొందరు కుల, విద్యార్థి సంఘాల నాయకులు సైతం విచారణ అధికారిని కలిసి.. ఆ అధికారిపై ఫిర్యాదు చేశారని తెలిసింది.

రెండు రోజుల్లో నివేదిక..

ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాం. వార్డెన్లతో వన్ టు వన్ మాట్లాడి వివరాలు నోట్ చేసుకున్నాం. విచారణకు వారు పూర్తిగా సహకరించారు. రాష్ట్ర డైరెక్టర్‌కు రెండు రోజుల్లో విచారణ నివేదికను అందజేస్తాను. డైరెక్టర్ తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తాం.

-శ్రీధర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్, బీసీ సంక్షేమశాఖ

శ్మశానం మాదే..!

ఖననాన్ని అడ్డుకున్న వైసీపీ నాయకులు

రెండుగంటలపాటు వాగ్వాదం

ఇదే చివరి అవకాశం అంటూ హుకుం


మృతదేహాన్ని ఖననం చేయకుండా అడ్డుకున్న వైసీపీ నాయకులు

కుందుర్పి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలం తమదేనంటూ వైసీపీ నాయకులు తెరపైకి వచ్చారు. మండలంలోని కరిగానపల్లిలో మృతదేహాన్ని పూడ్చకుండా గురువారం అడ్డుకున్నారు. రెండు గంటలపాటు కుటుంబీకులు, బంధువులకు హెచ్చరికలతో హడలెత్తించారు. గ్రామానికి చెందిన మాల లక్ష్మీదేవి గురువారం మృతిచెందింది. కుటుంబీకులు, బంధువులు.. ఆమె దేహాన్ని ఖననం చేయడానికి గ్రామ సమీపానగల వంక ప్రాంతంలోకి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు స్థలం తమదంటూ రెండు గంటలపాటు మృతదేహాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారు. లక్ష్మీదేవి కుటుంబీకులు తాము పూర్వం నుంచి ఇక్కడే మృతదేహాలను ఖననం చేస్తున్నామనీ, ఇప్పుడు అడ్డుపడడం ఏంటంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో వారు ఇదే చివరి అవకాశమనీ, ఇక్కడ ఇంకెవరినీ ఖననం చేయడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. శ్మశాన వాటికకు స్థలం, దారి చూపాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వపోయారు. ఇప్పటికైనా అధికారులు శ్మశాన వాటికకు స్థలం చూపాలని వారు కోరుతున్నారు.

ఫిడెతో రోటరీ క్లబ్ ఒప్పందం


ఒప్పందపత్రాన్ని చూపుతున్న ఫిడె, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆంద్రే, నాగార్జున

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ క్రీడాకారుల్లో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా ఫిడె (ప్రపంచ చెస్ సమాఖ్య)తో రోటరీక్లబ్ ఒప్పందం చేసుకుంది. బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఫిడెకి చెందిన ఆంద్రే, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా ప్రతినిధి నాగార్జున ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఇది జిల్లాలో చెస్ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఇరువర్గాల వారు అభిప్రాయపడ్డారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఏర్పడుతుందని మొదటి రాయలసీమ ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

రాగిరి రామయ్య సస్పెన్షన్

గిరిజన మహిళతో అనుచిత ప్రవర్తన

చర్యలు తీసుకున్న డీఐజీ షిమోషి

అనంతపురం క్రైం, పుట్టపర్తి, మడకశిర టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గిరిజన యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకు మడకశిర అప్‌గ్రేడ్ సీఐ రాగిరి రామయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు డీఐజీ షిమోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొలం సరిహద్దుల విషయంలో గొడవపడ్డ బంధువులకు సర్దిచెప్పాలని మడకశిర పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తనతో సీఐ అనుచితంగా ప్రవర్తించారని మడకశిర మండలం టీడీ పల్లి తండాకు చెందిన గాయత్రి గత శనివారం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎస్పీ, విచారణకు ఆదేశించారు. సీఐని వీఆర్‌కు పంపించారు. విచారణ నివేదిక అందిన తరువాత డీఐజీ ఆయనపై చర్యలు తీసుకున్నారు. కాగా, బాధితురాలితో కలిసి ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డీఐజీని గురువారం కలిశారు. సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గిరిజన మహిళను రాత్రి 10 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచుకున్నారని, వ్యక్తిగత విషయాలు ఆరా తీస్తూ మానసిక వేదనకు గురిచేశారని డీఐజీకి వివరించారు. అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడారు. బంధువులతో వివాదం తలెత్తడంతో ఈ నెల 6న మడకశిర పోలీస్ స్టేషన్‌కు మధ్యవర్తితో కలిసి వెళ్లానని తెలిపారు. సీఐ తనను చాంబర్‌లోకి పిలుచుకుని, తలుపులు వేయమని చెప్పి వ్యక్తిగత విషయాలు అడిగారని ఆరోపించారు. 'మీ ఆయనకు ఎందుకు దూరంగా ఉన్నావు..? మళ్లీ పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఉందా..?' అని అడిగారని ఆరోపించారు. ఆయన తీరు తనకు ఇబ్బందిగా అనిపించిందని, తన బంధువులను పిలిపించకుండా, ప్రతిసారీ తననే ఎందుకు పిలిచి మాట్లాడుతున్నారని అడిగినా పట్టించుకోలేదని అన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


గొల్ల ప్రసాద్ మృతదేహం

గుత్తిరూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన గొల్ల ప్రసాద్ (70) జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గొల్ల ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో విషపు గుళికలు మింగాడు. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

16న హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 16వ తేదీన ధర్మవరంలోని యశోద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సాకే శివశంకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాలికలు, జూనియర్ బాలుర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన బాలురు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు నెలాఖరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణకు ఆహ్వానం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై శిక్షణకు అర్హులు హాజరు కావచ్చని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. రిటైర్డు బ్యూరోక్రాట్లు, రిటైర్డ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు (గెజిటెడ్ హోదా), 15 సంవత్సరాల పైబడి ఏదైనా రంగంలో పనిచేసిన వృత్తి నైపుణ్యులు (డాక్టర్లు, సామాజిక సేవకులు, విద్యావేత్తలు తదితరులు) అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను తగిన ఆధారాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు ఈనెల 15వతేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని సూచించారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

సురక్షిత ఆన్‌లైన్ కార్యకలాపాలు సాగించాలి

జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ సుదర్శన రావు

ఎస్పీతో కలిసి సైబర్ సురక్ష వాహనాలు ప్రారంభం


సురక్ష వాహనాలను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ఎస్పీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల బారిన పడకుండా కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌లో సురక్షితంగా ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు.. విద్యార్థులకు సూచించారు. జేఎన్టీయూలో సైబర్ సురక్ష (మన భద్రత-మన బాధ్యత) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఎస్పీ జగదీశ్ అతిథులుగా హాజరయ్యారు. సైబర్ అవగాహన డిజిటల్ వాహనాలను వారు జెండా ఊని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో వీసీ మాట్లాడుతూ.. టెక్నాలజీతో ఆన్‌లైన్ సేవలు విస్తృతమయ్యాయన్నారు. రోజువారీ విధుల నుంచి మార్కెటింగ్ వరకు ఆన్‌లైన్ వినియోగం తప్పనిసరిగా మారిందన్నారు. దీనిని అదనుగా తీసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సాఫ్ట్‌వేర్లు, యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేటపుడు వాటికి సెక్యూరిటీ ఉందో.. లేదో.. చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మెయిల్స్, అప్లికేషన్స్, యూపీఐ, బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డులు తదితరాలకు పిన్‌కోడ్‌లు ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. మెజేజ్‌లు, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా వచ్చిన లింకులను క్షుణ్ణంగా పరిశీలించన తరువాతే ట్యాప్ చేయాలన్నారు. ఏమార్చితే వ్యక్తిగత సమాచారం మొత్తం నేరగాళ్లకు చేరిపోతుందని హెచ్చరించారు. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా డిజిటల్ వాహనాలను రూపొందించామన్నారు. వాటి ద్వారా డిజిటల్ అరెస్టులు, సెల్‌ఫోన్ వినియోగం, ఫెడెక్స్, ఇన్వెస్టిమెంట్, క్రిప్టో, స్టాక్‌మార్కెట్, ఫేక్‌లోన్ యాప్స్ తదితర మోసాలపై ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరాలపై www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, బ్యాంకు మేనేజర్లు రమేష్, నరసింగారావు, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జాకీర్ హుస్సేన్, ధరణికిషోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శాంతిలాల్, సాయినాథ్ పాల్గొన్నారు.

మృతదేహాన్ని తప్పించబోయి కారు బోల్తా

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి ఆర్టీఓ చెక్‌పోస్టు సమీపాన 44వ జాతీయరహదారిపై గురువారం మహిళ మృతదేహాన్ని తప్పించబోయి గుట్టను ఢీకొని కారు బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భిక్షాటన చేసుకునే మహిళను బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తర్వాత మృతదేహంపై పలు వాహనాలు కూడా వెళ్లాయి. పెనుకొండకు చెందిన రాజు పాలసముద్రం వద్దకు కారులో వెళ్తూ రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గుట్టను ఢీకొని, బోల్తాపడ్డాడు. ప్రమాదంలో రాజు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

బిడ్డ పెళ్లికి రమ్మంటే.. కొడవలితో దాడి

భార్యపై భర్త ఘాతుకం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానించిన భార్యపై భర్త కొడవలితో దాడి చేశాడు. పరిగి మండలం బీచినాగపల్లిలో గురువారం నిర్మలపై భర్త కరియప్ప కొడవలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హిందూపురానికి చెందిన నిర్మలను 26 ఏళ్ల క్రితం బీచిగానపల్లి వాసి కరియప్పకిచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా నాలుగేళ్లుగా వేరుగా ఉంటున్నారు. నిర్మల పిల్లలతో కలిసి హిందూపురంలోనే ఉంటోంది. కరియప్ప బీచిగానపల్లిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో వీరి కుమార్తె అలేఖ్యకు పెళ్లి సంబంధం కుదిరింది. పెళ్లి పత్రికలు ఇచ్చి భర్తను ఆహ్వానించేందుకు నిర్మల గురువారం బీచిగానపల్లికి వెళ్లింది. కోపోద్రిక్తుడైన కరియప్ప భార్యపై కొడవలితో విచక్షణా రహితంగా దాడిచేశాడు. అతడు పరారయ్యాడు. నిర్మల మెడపై, తల భాగంలో, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పడిపోయిన నిర్మలను బంధువులు ఆటోలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దాడులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వడదెబ్బతో యువకుడి మృతి

విడపనకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో వడదెబ్బతో శంకరప్ప (30) గురువారం మరణించాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వజ్రకరూరు మండలం పాత కడమలకుంట గ్రామానికి చెందిన శంకరప్ప (30) అమ్మమ్మ గ్రామమైన పాల్తూరులో గడ్డి వామి వేసేందుకు ఈనెల 12న వచ్చాడు. గురువారం ఉదయం నుంచి గడ్డివామి వేస్తూ నీరు తాగేందుకు కిందికి దిగాడు. వెంటనే కళ్లు తిరిగి స్పృహ తప్పి కింద పడిపోయాడు. బంధువులు తొలుత పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. శంకరప్పకు భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు.

పీహెచ్‌సీలో నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం

స్పృహ తప్పి పడిపోయిన శంకరప్పను తొలుత పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బీపీ మాత్రమే పరిశీలించి, ఉరవకొండకు పంపారు. ప్రథమ చికిత్స కూడా చేయకుండా పంపించేశారని బంధువులు ఆరోపించారు. వారి నిర్లక్ష్యంతోనే శంకరప్ప మరణించాడని వారు ఆవేదన చెందారు.

ఎస్పీకీ సైబర్ సెగ

ఎస్పీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు బాస్ ఎస్పీ జగదీశ్‌కే సైబర్ సెగ తప్పలేదు. ఎస్పీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఒకరు ఫేక్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఆ అకౌంట్ నుంచి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపారు. ఓ వ్యక్తికి ఐపీఎస్‌లు ఇలా పర్సనల్‌గా రిక్వెస్టులు ఎందుకు పెడతారన్న అనుమానం వచ్చింది. అందులో సంబంధంలేనివి ఉండటం అందుకు బలం చేకూరింది. వెంటనే పోలీసు అధికారులను సంప్రదిస్తే... అది ఫేక్ అని తెలిసింది. వెంటనే మెసెంజర్ ద్వారా ఫోన్ కాల్ చేశారు. నాలుగైదు సార్లు చేసినా లిఫ్ట్ చేయలేదట. కొంతసేపటికే ఆ అకౌంట్ ఫేస్‌బుక్‌లో కనిపించలేదట. ఫిర్యాదులు వెళ్తాయనే ఉద్దేశంతో సైబర్ నేరగాడు ఆ అకౌంట్‌ను క్లోజ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా గతంలో డీఎస్పీలు, సీఐల పేరుతో ఫేక్ అకౌంట్లు క్రియేట్లు చేసి, వాటి నుంచి డబ్బు పంపాలని మెసేజ్‌లు పంపారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. స్థానిక శారదానగర్‌లోని అనంత మహా సమాఖ్యలో గురువారంఉమ్మడి అనంత జిల్లా రైతు ఉత్పత్తిదారుల కంపెనీల డైరెక్టర్లు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహా రావు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, జీటీ భారత్ కంపెనీ టీ ం లీడర్ రామాంజులు, కేవీకే శాస్త్రవేత్త మల్లీశ్వరి, పలు కంపెనీల డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

● నార్పల: మండలపరిధిలోని బొందలవాడ గ్రామ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయా ధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదును ఆమె పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి, రైతు సేవా కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

● రాప్తాడు: ఆధార్ తరహాలో ప్రతి రైతూ తప్పనిసరిగా యూనిక్ ఐడీ తీసుకోవాలని వ్యవసా యశాఖ ఏడీ రవి తెలిపారు. మండలంలోని రాప్తాడు, గొంది రెడ్డిపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఆయన గురువారం రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏఓ శ్రీవాణి, గొందిరెడ్డిపల్లి సర్పంచ్ శీనయ్య, రైతులు పాల్గొన్నారు.

అదనంగా 50 ఉపాధి పనిదినాలు: ఎంపీడీఓ

రాప్తాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కరువు మండలాల జాబితాలో రాప్తాడు ఉన్నందున ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తయిన కూలీలకు అదనంగా 50 రోజులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంపీడీఓ విజయలక్ష్మి పత్రికా ప్రకటనలో తెలిపారు. వంద రోజులు పూర్తయిన కూలీలు మార్చి 31లోగా మరో 50 రోజుల ఉపాధి పనులు చేసుకోవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తపోవనం జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు టీడీపీ సీనియర్ నాయకులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పూర్వ విద్యార్థిగా ఆయన రూ.50వేలను పాఠశాల అభివృద్ధికి అందజేశారు. ఈ క్రమం లోనే గురువారం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను సత్కరించారు. ఆ విరాళంలోని కొంత సొమ్ముతో కొనుగోలు చేసిన ప్లేట్లు, గ్లాసులను ఆయన ద్వారా పంపిణీ చేయించారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు, టీడీపీ నాయకులు కృష్ణ కుమార్, మునీంద్ర పాల్గొన్నారు.

పంటలకు మరో నెల నీరివ్వండి: రైతులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): హెచ్ఎల్సీ ద్వారా పంటలకు మరో నెల రోజులు సాగునీరివ్వాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య కోరారు. హెచ్ఎల్సీ డీఈ చంద్రశేఖర్, ఏఈలు మల్లికార్జున, శంకర్ గురువారం మర్తాడు గ్రామం వద్ద కెనాల్‌ను పరిశీలించారు. రైతులు వారిని కలిశారు. రైతులకు మద్దతుగా ఆవుల క్రిష్ణయ్య మాట్లాడారు. దక్షిణ కాలువ కింద రైతులు సాగు చేసిన పంటలు పట్టు దశలో ఉన్నాయన్నారు. కాలువకు సాగునీరు బంద్ చేస్తే పంటలు ఎండిపోతాయన్నారు. డీఈ చంద్రశేఖర్ మాట్లాడాతూ. పంటల సాగుకు 120 రోజులు సాగునీరు విడుదల చేస్తామని ముందే చెప్పామని, ఇచ్చిన గడువు ముగిసిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని డీఈ రైతులకు తెలియజేశారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడైన మండలకేంద్రానికి చెందిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు. అతడిపై రెండు రోజుల క్రితం పోక్సో నమోదు చేయడంతో పరారయ్యాడు. అతడు స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికెళ్లి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో...

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఓ యువతి కేసులో వంశీ అనే యువకుడిని ఇటుకలపల్లి పోలీసులు రిమాండ్‌కు పంపారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన శిరీష అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. ప్రేమపేరుతో వేధింపులకు గురిచేశాడని వంశీపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గురువారం రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఎస్పీ జగదీష్ ఆదేశాలతో సైబర్ సురక్షలో భాగంగా సైబర్ నేరాలపై వీడియోల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. గురువారం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, టూటౌన్ సీఐ శ్రీకాంత్,త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ల పర్యవేక్షణలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, అరవిందనగర్ పార్కు, చంద్రహస్పిటల్ సర్కిల్, టవర్ క్లాక్ కూడలి, ఐదోరోడ్డు, గిల్డ్‌ఆఫ్ సర్వీస్ రోడ్డులలో డిజిటల్ వాహనాలుంచి సైబర్ ఫ్రాడ్స్‌పై అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు : సీఐ

గార్లదిన్నె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. ఆయన గురువారం సాయంత్రం గార్లదిన్నెలో ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తిరుమలలో అనంత కళాకారుల ప్రదర్శన


తిరుమలలో ప్రదర్శన ఇచ్చిన అనంత కళాకారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద అనంతవాసుల కళాప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ బృందం కోలాటంతో పాటు, పురందరదాస కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చినట్లు నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య తెలిపారు. దాససాహిత్య ప్రాజెక్టుకు కృషి చేసిన విజయమ్మ, వనజమ్మ, సుబ్బలక్ష్మి, ఉమాదేవి తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా

● కలెక్టర్ వినోద్‌కుమార్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం మండలంలోని కక్కలపల్లి పరిధిలో క్రమబద్ధీకరణ పథకం-2025 కింద దర ఖాస్తు చేసుకున్న మేకల మేరి అనే మహిళ ఇంటికి వెళ్లి నేరుగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. 72.6చదరపు గజాలలో ఇల్లు నిర్మించుకున్నట్లు కలెక్టర్‌కు తెలి పింది. కుటుంబ వార్షిక ఆదాయ వివరాలను, కుటుంబ సభ్యుల వివారాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 150చదరపు గజాల ప్రభుత్వ స్థలానికి పైబ డి ఆక్రమించుకుని, నివాసం ఏర్పచుకుని ఉంటే అలాంటి వారు 15శాతం నుంచి 200శాతం వరకు మార్కెట్ ధరను చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తామని కలెక్టర్ తెలిపారు. అబ్ధిదారులాలి దరఖాస్తును, ఫారం-2లో పేర్కొన్న వివరాలన్నింటిని కలెక్టర్ అక్కడిక్కడే వీఆర్‌ఓతో నమోదు చే యించారు. తాము అన్ని విధాల పరిశీలించామని, నిబంధనల మేరకు భూమి ఉందని తహసీల్దార్ వివరించారు. గ్రామంలోని సబ్‌డివిజన్ చేసిన తర్వాతనే క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుందని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆర్డీఓ కేశనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల మంజూరుకు చర్యలు : ఎమ్మెల్యే


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఇళ్లులేని వారికి త్వరలో ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో గురువారం మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, వీధి దీపాలు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, నాయకులు చేపల హరి, నగేష్‌నాయుడు, జయరాం, లక్ష్మీనారాయణ, బాలాంజనేయులు, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, రాజారావు, లక్ష్మీనరసింహ, సంగా తేజస్విని, సరళ, నెట్టెం బాలకృష్ణ, ఇస్మాయిల్, ఓంకార్‌రెడ్డి, గోపాల్ గౌడ్, మారుతీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి సమష్టి కృషి

● మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి సమష్టిగా పనిచేస్తామని మాజీ మంత్రి, వైసీపీ నేత సాకే శైలజానాథ్ అన్నారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యకర్తలు, యువకులు శైలజానాథ్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాటలకే పరిమితమవుతున్నారన్నారు. సాకే చంద్ర నాయకత్వంలో జగన్ ఆశయసాధన కోసం యువకులు నిర్మాణాత్మకంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌దత్తా, సాకే మహేష్, లోక్‌నాథ్‌రెడ్డి, సురేంద్ర, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే... హామీలు నిలుపుకో: మేయర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : మభ్యపెట్టే మాటలొద్దని... ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎనిమిది నెలల్లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సవాల్ విసిరారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లతో కలిసి మేయర్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో అభివృద్ధే జరలేదని మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పదే పదే మాట్లాడటాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. మీరు వెళ్తున్న రోడ్లు, చూస్తున్న కాలువలు వైసీపీ హయాంలో నిర్మించినవేనన్నారు. డిప్యూటీ మేయర్ సాహిత్య, సైఫుల్లాబేగ్ నరసింహులు, కమల్‌భూషణ్, చింతకుంట మధు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు చంచల్ గూడ.. మేయర్‌కు రెడ్డిపల్లి ఖాయం

● టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చంచల్ గూడ జైలుకు, మేయర్ వసీం రెడ్డిపల్లి జైలుకు వెళ్లడం ఖాయమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులు సైఫుద్దీన్, ముక్తియార్, ఇస్మాయిల్, రాయల్ మధు, జేఎం బాషా మాట్లాడారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిని చూస్తుంటే మేయర్‌కు వణుకు పుడుతోందన్నారు. గత ఐదేళ్లల్లో చేసిన అవినీతి పనులు త్వరలోనే బయటకు వస్తాయన్నారు. వైసీపీ కార్పొరేటర్లే డంపింగ్ యార్డు అవినీతిని ప్రస్తావించారంటే అర్థం చేసుకోవచ్చన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఎంవీఐ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సునీత పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(మిట్స్) కళాశాల ఆధ్వర్యంలో వినూత్నంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమోషనల్ ఫ్లాష్‌మోబ్ పేరుతో క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంవీఐ సునీత ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాహిద్, ప్రదీప్, ప్రీతి, శ్రీనివాసులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'యునీక్ డిజేబుల్ ఐడీ జారీలో జాప్యం'

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంబంధించి యూనిక్ డిజేబుల్ ఐడీ నెంబర్ జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏడీ వినోద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాకే అంజనేయులు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, నాగరాజు, రసూల్.. ఏడీకి వినతిపత్రం అందజేశారు.

ఆస్పత్రిలో చలివేంద్రం ప్రారంభం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంకావడంతో ఎండలు పెరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులు, వారికుటుంబసభ్యులదాహార్తితీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేసారు. గురువారం ఆచలివేంద్రంను అనంతపురం ఎంఎల్‌ఏ దగ్గుబాటి ప్రసాద్ చేతులుమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు పద్మజ, ఆస్పత్రి అబివృద్ధికమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, పలువురు డాక్టర్లు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

త్వరలోనే నగరంలో భూగర్భ డ్రైనేజీ

● ఎమ్మెల్యే దగ్గుపాటి ● అధికారులతో సమీక్ష

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీని తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చించనున్న నేపథ్యంలో గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్, ఇం జనీరింగ్, ఇతర నగర పాలక సంస్థ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఆవశ్యకతపై చర్చించారు. రూ.750 కోట్లతో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు పంపామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

అనంతపురం అర్బన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్స్, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో సమావేశమయ్యారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రతి డివి జన్‌లోనూ సచి వాలయ సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతంతో పనిలేదని, ఇప్పటినుంచి సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏటీఎస్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని వినతి


రవాణా శాఖ మంత్రిని సన్మానిస్తున్న ఏటీఎస్ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ఏటీఎస్) బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ ఏటీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు అనంతపురం ఏటీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు నాగార్జునరెడ్డి రాష్ట్రంలోని ఇతర కేంద్రాల నిర్వాహకులతో కలిసి విజయవాడలో మంత్రికి ఆయన క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఏటీఎస్ స్టేషన్ల ప్రాధాన్యం, అభివృద్ధి, మౌలిక సదుపాయల కల్పనపై విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రణతికి డాక్టరేట్



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నెహ్రూ యువకేంద్రంలో కీలకంగా పనిచేస్తున్న ప్రణతి డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్‌స్టడీస్ (సీఈఎస్ఎస్)లో ప్రొఫెసర్ బలరాములు పర్యవేక్షణ పట్టణ, స్థానిక రాజకీయాలలో మహిళల పాత్ర అనే అంశంపై ప్రణతి చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న గృహోపయోగ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలో సివిల్‌సప్లై అధికారులు దాడులు నిర్వహిం చారు. 82 సిలిండర్లను సీజ్ చేసినట్లు జేసీ శివనారాయణశర్మ తెలిపారు. అలాగే గ్యాస్‌సిలిండర్ల సరఫరాకు నిబంధనలకు విరుద్ధంగా అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఏజెన్సీలకు జేసీ శివనారా యణశర్మ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్యాస్‌ఏజెన్సీలతో జేసీ సమావేశం నిర్వహించారు. దీపంపథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా గృహోపయోగ సిలిండర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో దీపం కింద 3,97,507 మంది లబ్ధిదారులకు ఉచితంగా సిలిండర్లు సరపరా చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీ ఉన్నా.. డబ్బు వసూలు: సీపీఐ



ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ఉన్నా పలు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు అక్ర మంగా డబ్బులు వసూసు చేస్తున్నా యని, వాటిపై చర్యలు తీసు కోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కిమ్స్ సవీరా ఆస్పత్రిలో ఇలా డబ్బులు డిమాండ్ చేసి, వారు ఇవ్వకపోవడంతో వైద్యం అందించకుండా పంపారంటూ బాధితురాలితో కలిసి గురువారం స్థానిక డీఎం హెచ్‌ఓ కార్యా యంవద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు రమణయ్య శ్రీరా ములు, అల్లీపీరా, కృష్ణుడు తదితరులు మాట్లాడుతూ కిమ్స్ సవీరా ఆస్పత్రి యాజమాన్యం పేదల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నా అదనంగా డబ్బులు ఇస్తేనే అక్కడ వైద్యం అందిస్తామంటున్నారని మండిపడ్డారు. గతనెలలో ఓ మహిళను ఇలాగే డబ్బు డిమాండ్ చేశారని, ఎందుకివ్వాలని ఆమె అడిగినందుకు వైద్యం చేయకుండా బయటకు పంపారన్నారు. ఆమె మరో ఆస్పత్రికి వెళ్లి వైద్యం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీనిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఫిర్యాదుచేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల కావేటి ఆస్పత్రిలో కూడా ఇలాగే అదనంగా డబ్బులు వసూలు చేసి కూడా, ఆరోగ్యశ్రీ అనుమతి రాలే దని నిర్లక్ష్యం చేయడంతో ఓ వ్యక్తి మర ణించాడన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు కిరణ్‌కుమార్ రెడ్డి వారి వద్దకు వచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, వరలక్ష్మి, శీనా, జానకి, రాజు, నాగప్ప, మున్నా, ఖాజా, ఆనంద్, బాషా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ మీటింగ్స్ ఉత్తర్వులు రద్దుచేయాలి : యూటీఎఫ్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖాధికారులు రెండు రోజుల కిందట ఇచ్చిన క్లస్టర్ మీటింగ్స్ ఉత్తర్వులు రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. గురువారం ఆ సంఘం నాయకులు డీఈఓను కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే మీటింగ్స్‌కు చేరుకోడానికి టీచర్లకు అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తర్వాత యాప్‌లో అటెండెన్స్ వేసి, మీటింగ్స్ కోసం క్లస్టర్‌కు చేరడానికి అనేక ఇబ్బందులు ఉంటా యన్నారు. ఈ మేరకు డీ ఈఓకు వినతిపత్రం అందించారు. నాయకులు రమణయ్య, సరళ, సుబ్బరా యుడు, దేవేంద్రమ్మ, మహమ్మద్ జిలాన్, శ్రీనివాసులు, పవన్ కుమార్, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

తప్పక ఈ-పంట నమోదు చేయాలి: జేసీ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణ్‌శర్మ వ్యవసా యాధికారులను ఆదేశించారు. ఆయన గురువారం ఈ-పంట సూపర్ చెక్‌లో భాగంగా మండలంలోని సోములదొడ్డి గ్రామ రైతు పెద్ద వెంకటస్వామికి చెందిన వ్యవసాయ తోటను పరిశీలించారు. గ్రామంలోని వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి శశికళ, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ పంపిణీ

● చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తు న్నామని ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తుందని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలోని నలుగురికి మంజూరైన మొత్తం రూ.9, 74,982 చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, సీకేపల్లిమండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ పోస్టులను రద్దు చేయండి

● ఆర్జేడీకి సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఆరుగురికి ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్స్ ఇచ్చారని, వాటిని రద్దు చేయాలని కొందరు సంఘాల నేతలు ఆర్‌జేడీ శామ్యూల్‌ను కోరారు. పాత డీఈఓ కార్యాలయానికి వచ్చిన ఆర్‌జేడీని గురువారం వారు కలిశారు. జిల్లాలో ఆరుగురికి నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్స్ ఇచ్చారని ఫిర్యాదు చేశారు. వెంటనే వారిని వెంటనే రిలీవ్ చేసి, ఆయా పాఠశాలలకు పంపాలని కోరారు. కొత్త నోటిఫికేషన్ ఇచ్చి, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీకి వినతిపత్రం అందించారు. కాగా, జిల్లా విద్యాశాఖ అధికారులకు వస్తున్న బెదిరింపులపై వెంటనే నివేదిక ఇవ్వాలని డీఈఓ ప్రసాద్‌బాబును ఆర్జేడీ ఆదేశించారు. 'చెప్పినట్లు చెయ్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. సొంత శాఖలో అధికారులనే వేధించడం ఏమిటని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

బెదిరించలేదు

దళిత ఉపాధ్యాయని పోస్టింగ్ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఆరు నెలలుగా డీఈఓను కోరుతున్నా దాటవేస్తున్నారని ఎంఈఓల సంఘం రాష్ట్ర సలహాదారు డాక్టర్ రామచంద్ర ఆరోపించారు. ఈ విషయమై ప్రజా సంఘాలవారు కూడా డీఈఓను కలిసి ప్రశ్నించారని, ఎవరూ ఆయనను బెదిరించలేదని స్పష్టం చేశారు.

సంచులు లేవని కొనుగోలు చేయరా..!

● సీఐటీయూ నాయకులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సంచులు లేవని కందులు కొనుగోలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు బాలరంగయ్య, రామాంజనేయులు గురువారం మండలంలోని చియ్యేడు సొసైటీలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో గోని సంచులు లేని కారణంగా కందులు కొనుగోలను ఈనెల 15వ తేదీ నుంచి చేపడుతామని నోటీస్ బోర్డులో పేపర్ అంటించారన్నారు. మిగిలిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో, రైతులు సొసైటీ చుట్టూ తిరుగుతూ సరైన సమాచారం ఇచ్చేవారు లేక అవస్థలు పడుతున్నారన్నారు.

'అంబేడ్కర్ వర్సిటీ అడ్మిషన్లు పునఃప్రారంభించాలి'

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లు పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నేతలు గురువారం సీపీఐ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత పదేళ్లు ఉన్న ఉమ్మడి హక్కు 2024 జూన్‌కు పూర్తయిందన్నారు. దీంతో తెలంగాణా ప్రభుత్వం ఏపీలో అంబే ద్కర్ ఓపెన్ వర్సిటీ తరపున అడ్మిషన్లు నిలిపివేసిందన్నారు. దీంతో మన రాష్ట్ర విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే అడ్మిషన్లు పునఃప్రారం భించేలా చూడాలన్నారు. ఆ సంఘం నాయకులు మంజునాథ్, ఉమామహేష్, నాని, సమీర్, తారక్,తరుణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

● హెచ్ఓడీల సమీక్షలో సూపరింటెండెంట్ ఆదేశం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన గురువారం తన చాంబర్‌లో హెచ్ఓడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్లు, ఇతరసిబ్బంది ఉదయం9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తప్పనిసరిగా డ్యూటీలో ఉండాలన్నారు. కమిషనర్ ఈవిషయంలో సీరియస్‌గా ఉదన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు.అలాగే ప్రతి విభాగంలో వైద్యశాఖ ఆదేశాల మేరకు శస్త్రచికిత్సలు నిర్వహించి ప్రగతి చూపించాలని, ఈ విషయంలో హెచ్ఓడీలు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టరు రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

16న సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడి
- ఏర్పాట్లపై అధికారులతో చర్చలు

రాయదుర్గం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో అర్హులైన రైతులకు ఈ నెల 16వ తేదీన సూక్ష్మసాగునీటి సేద్య పరికరాల పంపిణీ చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని తన స్వగృహంలో గురువారం ఆయన ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 11:30 గంటలకు పంపిణీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఏపీఎంఐపీ సహాయ సంచాలకులు ఫిరోజ్‌ఖాన్, సిబ్బందిని ఆదేశించారు. ఈ ఏడాది నియోజకవర్గ పరిధిలో


పంపిణీ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కాలవ

875 మంది రైతులకు చెందిన 9,816 హెక్టార్ల విస్తీర్ణానికి సరిపడా పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన రైతులతో పాటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కణేకల్లు: మండలకేంద్రానికి చెందిన కురుబ యువరాజుకు రూ. 1.96 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇటీవలే ఆయన గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నాడు. కాగా అతడి ఆర్థిక పరిస్థితి బాగలేనందున ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సీఎంరిలీఫ్ ఫండ్ కోసం ప్రతిపాదించారు. దీంతో మంజూరవడంతో అందుకు సంబంధించిన చెక్కును కాలవ గురువారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఎస్కే మల్లికార్జున, నాగార్జున పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అవాంఛనీయ ఘటనలకు తావివ్వరాదు: ఎస్పీ


సేవాఘడ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఎస్పీ జగదీష్ సిబ్బందికి సూచించారు. మండలంలోని సేవాఘడ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పోలీస్ అధికారులతో మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి సైతం లక్షలాదిగా భక్తులు వస్తారని, ఎలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్లు డీ ఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఓబులేసు, సీఐలు వెంకటేశ్వర్లు, చిన్నగౌస్, రాజు, మస్తాన్, ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

శెట్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయాన్ని, యాటకల్లు-2 సచివాలయాన్ని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ రఘురామారావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ.. సమయపాలన తప్పక పాటించాలన్నారు. ఇక నుంచి ప్రతి సచివాలయ ఉద్యోగి ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ వేయాలని సూచించారు. కొందరు సచివాలయ ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరుకావడం లేదని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం సచివాలయంలోని పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

ఉరవకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకదుర్గ గోల్డ్‌లోన్ ఫైనాన్స్ కంపెనీలో బంగారం అవకతవకల కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ మహానంది తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషనలో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత జనవరి 26వ తేదీన కంపెనీ రీజనల్ ప్రాజెక్టు హెడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గోల్డ్‌లోన్ ఫైనాన్స్ కంపెనీలో ఐదుగురు నకిలీ అకౌంట్లను సృష్టించి, నకిలీ బంగారంతో రుణాలను మంజూరు చేయించుకున్నారని, సుమారుగా రూ.56.6లక్షలు నష్టం కలిగించారని ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఆ నిందితుల్లో ముగ్గురైన పల్లా ప్రశాంత్ కుమార్, చాకలి వెంకటేశులు, రామాంజనేయులును చిన్నముష్టూరు సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు. మరో నిందితుడైన చంద్రశేఖర్ గత సోమవారం కోర్టులో లొంగిపోయిన విషయం తెలిసిందే. సమావేశంలో ఎస్ఐ జనార్ధన్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

ఉరవకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బంజారా నాయకులు డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో గురువారం సేవాలాల్ ఇరుముడి నిర్వహించారు. అనంతరం పలువురు ఇరుముడితో సేవాఘడ్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం సేవాలాల్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అలాగే ఉత్సవాలకు రూ.2కోట్లు విడుదల చేయాలని కోరారు. నాయకులు సుబ్రహ్మణ్యంనాయక్, దాసునాయక్, సామానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన

విడపనకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు స్వీయ రక్షణపై ఐసీడీఎస్ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు స్వీయ రక్షణలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మండలంలోని పాల్తూరు, గడేకల్లు, విడపనకల్లులలోని జడ్పీ పాఠశాలల్లో, ఆదర్శ పాఠశాల్లో ఈమేరకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల దాణా షెడ్డు దగ్ధం

శెట్టూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మచింఖాన్‌కు చెందిన కోళ్లఫారం పక్కనున్న దాణా షెడ్డుకు గురువారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో షెడ్డుతో పాటు అందులో వున్న కోళ్ల దాణా, నీటిని వుంచే ప్లాస్టిక్ గిన్నెలు, బుట్టలు, టార్పాలిన్ పట్టలు తదితర సామగ్రి ఆహుతయ్యాయి. రూ.2.50లక్షల మేర నష్టం వచ్చినట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంగన్నపల్లి గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బేతాపల్లికి చెందిన యువకులు రాము, లాలూస్వామి బైక్‌పై తొండపాడు బొలికొండరంగనాథస్వామి రథోత్సవానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. కాగా యంగన్నపల్లి గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కదరంపల్లి వద్ద ఒకరికి..

రాయదుర్గంరూరల్: మండలంలోని కదరంపల్లి గ్రామ వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కదరంపల్లికే చెందిన వన్నూరుస్వామి పొలంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డును దాటుతుండగా.. వెనుక వైపు నుంచి అదే గ్రామానికి చెందిన తిప్పేస్వామి, సంతోష్ మరో బైక్‌లో వేగంగా వస్తూ ఢీకొట్టారు. ప్రమాదంలో వన్నూరుస్వామికి తలకు తీవ్రగాయాలయ్యాయి. తిప్పేస్వామి, సంతోష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వన్నూరుస్వామిని కుటుంబసభ్యులు రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు.

వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు

యాడికి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. మండలకేంద్రానికి గురువారం వచ్చిన ఆయన అక్కడి మాలలతో సమావేశమై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయం తదితర అన్ని రంగాల్లోనూ రిజర్వేషన్ల పరంగా మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణకు నిరసనగా ఈనెల 23వ తేదీ కర్నూలులో మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని మాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్, జిల్లా కార్యదర్శి రత్నకుమార్, యాడికి మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

చెన్నకేశవ స్వామి ఆలయ ఆదాయం ఏమైంది..?

- సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ ఆగ్రహం

యాడికి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు దాతలపై ఆధారపడటం తగదని, ఇంతవరకు వచ్చిన ఆలయ ఆదాయపు సొమ్ము ఏమైందంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం ఆయన స్థానిక ఆలయంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయ భూములు, స్వామివారిపేరిట ఉన్న బ్యాంకు నగదు వివరాలు, ఆలయ గదుల అద్దెల వివరాలను ఈఓ దుర్గాప్రసాద్‌తో ఆరా తీశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ.11లక్షలు ఉందని, 780 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయని ఈఓ వివరించారు. అయితే స్వామి భూముల వివరాల లెక్కలు పక్కాగా లేవని చెప్పడంతో జేసీపీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ గదుల అద్దెల ద్వారా నెలకు సుమారు రూ.74 వేలు ఆదాయం వస్తున్నా.. ఉత్సవాల కోసం దాతలపై ఆధారపడాల్సి రావడం దారుణమని తెలిపారు. అన్యాక్రాంతమైన స్వామి భూముల వివరాలను రెండురోజుల్లో తనకు అందించాలని ఈఓను ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

గత ఐదేళ్ల నుంచి జమ, ఖర్చుల వివరాలు ప్రతి ఒక్కటీ తెలియజేయాల్సిందేనని తెలిపారు. లెక్కల్లో ఏమాత్రం తేడా వచ్చినా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకనుంచి స్వామివారి సొమ్ము ఒక్కరూపాయి కూడా దుర్వినియోగం కావడానికి వీలులేదని, ఆలయం పేరిట బ్యాంకు ఖాతా తెరవాలని, జమ ఖర్చులన్నీ దాని ద్వారానే జరగాలని సూచించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామపెద్దలను కోరారు. సమావేశంలో ఆలయ అర్చకుడు హరికృష్ణశర్మ, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: సీఐ

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో డ్రైవర్లకు పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం ఆటోడ్రైవర్లతో సీఐ యువరాజు సమావేశమై మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆటో రికార్డులు తప్పక ఉండాలన్నారు. అలాగే అధికలోడుతో వెళ్లరాదని, మొబైల్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం వేసుకోవాలని, రోడ్డుభద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

యాడికి: మండలకేంద్రంలో సీఐ ఈరన్న ఆటోడ్రైవర్లతో సమావేశమై రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోల్లో అధిక పరిమితితో ప్రయాణికులను తరలించరాదని తెలిపారు. డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోరాదని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారి ఆటోలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

వాసాపురంలో పంపిణీ కాని రేషన్

- తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదమే కారణం

యల్లనూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం గ్రామంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఏర్పడిన డీలర్‌షిప్ వివాదంతో రేషన్ పంపిణీ ఆగిపోయింది. ఈ గ్రామంలో అధికారపార్టీలో రెండు వర్గాలు ఉన్నాయి. ఇక్కడ స్టోర్ డీలర్‌షిప్ విషయంలో ఆ రెండు వర్గాలు తమకు కావాలంటే.. తమకు కావాలంటూ పట్టుపట్టాయి. గత కొంతకాలంగా పార్టీ కోసం పనిచేసి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డామని, దీంతో స్టోర్ తమకే ఇవ్వాలని నరేంద్రనాయుడు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. మరో వర్గానికి చెందిన పాపారావు, నాగరాజు ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్ అవతలి వర్గానికి ఇచ్చారు కదా.. డీలర్‌షిప్ మాకే ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయం రెండునెలలుగా సాగుతోంది. అయితే ఫిబ్రవరి నెలకు సంబంధించిన కోటా పంపిణీని రెవెన్యూ అధికారులు పాపారావు వర్గానికి చెందిన సంధ్యపేరుతో శ్రీనివాస ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు ఆర్డర్ కాపీ అందించారు. దీంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఈ విషయంపై ఇరువర్గాలు జిల్లా పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. అసలే ఫ్యాక్షన్ గ్రామంగా పేరు ఉన్న వాసాపురంలో స్టోర్‌డీలర్ సమస్య చిలికి చిలికి గాలివానగా మారుతోంది. దీంతో రెవెన్యూ అధికారులు సైతం రేషన్ పంపిణీకి ముందుకు రావడం లేదు. 12రోజులైనా గ్రామంలో రేషన్ పంపిణీ జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వెంటనే గ్రామంలో రేషన్ పంపిణీ జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మద్యం ధరల పెంపును ఉపసంహరించుకోవాలి: సీపీఎం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం, ఐద్వా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పొట్టిశ్రీరాముల విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటు ఉందంటూ మద్యం ధరలను పెంచడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం ధరల పెంపును ఉపసంహరించాలని అన్నారు. అలాగే పలు చోట్ల మద్యం దుకాణాదారులు ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు షాపులను ఓపెన్‌లో ఉంచుతున్నారని, అలా కాకుండా నిర్ణీత సమయపాలన పాటించేలా చూడాలని కోరారు. సీపీఎం నాయకులు సురేంద్రబాబు, రామునాయక్, జయమ్మ, లక్ష్మీబాయి, షకీరా, ఖాదర్, రాము, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అర్జీల స్వీకరణ

తాడిపత్రి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థలాల కోసం పట్టణంలో ఇళ్లులేని నిరుపేదల నుంచి సీపీఐ నాయకులు చేపట్టిన అర్జీల స్వీకరణ కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా స్థానిక 8వవార్డులో ఇళ్లులేని వారివద్ద నుంచి అర్జీలు తీసుకున్నట్లు పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. నాయకులు శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలోకి 10కుటుంబాల చేరిక

పట్టణంలోని శివాలయంరోడ్డులో 10కుటుంబాల వారు సీపీఐలోకి చేరారని పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ తెలిపారు. వారికి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి కండువా వేసి సాదరంగా ఆహ్వానించినట్లు చెప్పారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో కులగణనపై గురువారం వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ.. బీహార్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా కులగణన చేపట్టాలన్నారు. జాతీయ ఫలాలు ప్రతి కులానికీ అందేలా పంపకాలు చేయాలన్నారు. అప్పుడే వారు సంపన్నులవుతారన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు దీనిపై పెద్దఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పలు కులాల నాయకులు, మతాల పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీష్

అన్న క్యాంటీన్ పరిశీలన

గుత్తి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ టోకెన్ సిస్టమ్, ఫుడ్ సర్వీస్, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వర్కర్లు పరిశుభ్రత పాటిస్తూ భోజనాన్ని వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ హరికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి పెద్ద తండాలో గురువారం నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. వైద్యుడు గోవిందు నాయక్ వివిధ వ్యాధిగ్రస్థులను పరీక్షించి మందులను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ నారాయణనాయక్, గౌరవాధ్యక్షుడు చలపతి, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రైతు సేవాకేంద్రం సిబ్బందికి శిక్షణ

పుట్లూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రైతు సేవా కేంద్రం సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషారెడ్డి మాట్లాడుతూ.. పంటలు సాగు చేసిన రైతులతో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. అనంతరం కందుల కొనుగోలు కేంద్రం నిర్వహణపై ఆరాతీశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కాత్యాయిని, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులోని లీలావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట లక్ష్మణ్ గురువారం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు రాజు, వృద్ధాశ్రమ నిర్వాహకులు కృష్ణవేణి, విక్రమ్ పాల్గొన్నారు.

మహిళపై దాడి

గుత్తి, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కోట వీధిలో నివాసముంటున్న మహబూబీ అనే మహిళపై అదే కాలనీకి చెందిన అజీమ్, మాబ్బి, బాబుతో పాటు మరో ఇద్దరు కలిసి గురువారం దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి వద్ద ఉన్న స్థల విషయంలో గొడవకు దిగారు. ఈ గొడవ కాస్త ఘర్షణకు దారి తీసింది. దీంతో కోపాద్రికులైన అజీబ్‌తో పాటు మిగిలిన వారు మహబూబీపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

కూడేరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ జేవీ రమేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయానికి 9 గంటల కరెంటు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్ ఇవ్వడానికి అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి నుంచి కూడేరుకు 33 కేవీ లైన్ నూతనంగా ఏర్పాటు చేయాలని ఏఈ గౌస్‌ముద్దీన్ ఈఈకి వివరించారు. అలాగే కూడేరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయాలని తెలిపారు. దీంతో పూర్తి స్థాయి నివేదిక పంపాలని, త్వరగా పనులు చేసి, మండలంలో నాలుగు సబ్ స్టేషన్ల పరిధిలో 9 గంటల కరెంటు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని ఈఈ పేర్కొన్నారు. డీఈ రఘు పాల్గొన్నారు.

పప్పుశనగకు మద్దతు ధర కల్పించాలి

కణేకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పప్పుశనగను ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. ఏడు వేలు మద్దతు ధర ప్రకటించి రైతుల నుంచి కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కురుబ తిప్పేస్వామి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు విజయ్‌కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వైద్యుడు శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఆయన మండలంలోని ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేపట్టాలన్నారు. అలా కాదని సెలైన్ ఎక్కించడం, ఇంజక్షన్లు వేయడం తదితర పనులను చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ క్లినిక్‌ను సీజ్ చేస్తామని తెలిపారు. అందరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేయాలని చెప్పారు.

అశ్వవాహనంపై రంగనాథుడు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి అశ్వవాహనం వాహనంపై ఊరేగారు. వేకువజామునే అర్చకులు ఆలయంలో స్వామివారికి అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చి మేళతాళాల మధ్యన ఊరేగింపు చేశారు. అనంతరం పల్లకిలో కొలువుదీర్చి స్థానిక జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, రవి స్వామి, చేతన్ వర్మ, లికిల్ వర్మ, రాఘవేంద్రచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భగళాముఖి అమ్మవారి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగొండ గ్రామంలో గురువారం సాయంత్రం భగళాముఖి అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ లు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి పూజలు చేశారు. తర్వాత అశేష భక్తజనం నడుమ, మేళతాళాల మధ్యన రథాన్ని ఆలయం నుంచి స్థానిక సింహకట్ట వరకూ లాగి తర్వాత యథాస్థానానికి చేర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పుస్తకాల వితరణ

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలప్పదొడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లైబ్రరీకి రిటైర్డ్ హెచ్‌ఎం నాగేంద్ర కుమార్ వాసవీ సేవా సమితి, ఎన్ఆర్ఐ హైదరాబాద్ సౌజన్యంతో పలు పుస్తకాలను వితరణ చేశారు. ఇందుకు ముఖ్యఅతిథిగా ఎస్ఐ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. హెచ్‌ఎం ప్రేమానంద, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ రూపమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ఉరవకొండ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లిలో ప్రజలకు వడదెబ్బపై రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ నాయక్ గురువారం అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పనులు చేసే సమయంలో కూలీలు తలపాగా ధరించాలన్నారు. తలనొప్పి, తలతిరగడం, నీరసం, స్పృహకోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్‌వో రూపా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

యాడికి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ వీరరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ తేదీలోగా అర్హులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుత్తి: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వరకు గడువు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్లకు సంబంధించిన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

గడ్డి వాములు దగ్ధం


అనగానదొడ్డిలో కాలిపోతున్న గడ్డి వాములు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనగానిదొడ్డి లో ముగ్గురు రైతులకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు క్రిష్ణయ్య, రామాంజనేయులు, రంగడు తమ పశువుల మేత కోసం వేరుశనగ పొట్టును పక్కపక్కనే ఉన్న తమ దొడ్డి కళ్లాల్లో వాములు వేసి ఉంచారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు బీడీ తాగి సమీపంలో పడేయడంతో నిప్పు చెత్తకు అంటుకొని మంటలు వ్యాపించి పక్కనే ఉన్న వాములు దగ్ధమయ్యాయి. గుంతకల్లులో ఉన్న అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి వాములు పూర్తిగా కాలిపోయాయి. దీంతో క్రిష్ణయ్యకు రూ.90 వేలు, రామాంజనేయులుకు రూ.60 వేలు, రంగడుకు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు.

యాడికి: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో రూ.30వేలు విలువచేసే పశుగ్రాసం కాలిబూడిదైన సంఘటన తిప్పారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. రైతు పుల్లారెడ్డి రెండు ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పొట్టును పొలంలోనే వాము వేశాడు. కాగా గురువారం గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పుపెట్టారు. అటువైపుగా వెళుతున్న స్థానికులు సమాచారం అందించడంతో బాధిత రైతు పొలం వద్దకు వచ్చాడు. అప్పటికే గ్రాసం మొత్తం కాలి బూడిదైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ విద్యార్థి


విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్య శిబిరంలో పట్టణంలోని డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ చిన్నమల్లి పాల్గొన్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామి రెడ్డి గురువారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో గల శ్రీవైస్ కాలేజీలో ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో చిన్నమల్లి పాల్గొన్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థి మాట్లాడుతూ ఈ శిబిరంలో 13 రాష్ట్రాల వలంటీర్లు 200 మంది పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు తెలుసుకున్నానని చెప్పారు. ఎస్కే యూనివర్సిటీ నుంచి ముగ్గురు వలంటీర్లు వెళ్లగా అందులో తనకు చోటు దక్కిందన్నారు. తర్వాత ఆ విద్యార్థిని కళాశాల అధ్యాపకులు అభినందించారు. అలాగే ప్రిన్సిపాల్ ప్రశంసాపత్రం అందజేశారు.

ఏజీపీ హేమాద్రికి సన్మానం


ఏజీపీని సన్మానిస్తున్న పత్తి హిమబిందు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఎఫ్‌సీఎం కోర్టులో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమితులైన హేమాద్రికి టీడీపీ అనంతపురం పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తిహిమబిందు గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా శాలువ వేసి పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారి మంజుల, నాయకులు నారాయణ, కదిరప్ప, లోకేంద్ర, వన్నూరప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.